RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -25 | శనివారం 24 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-


54, 55వ డివిజన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



04


అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి
అనుభవం కలిగిన, జర్నలిజంపై
ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను.
కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090




## మాట ప్రకారం నామినేషన్లు వేయించాం.. గెలుస్తాం: కాకాణి

**గూడూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం గూడూరులో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ల సమయంలో తమ పార్టీ అభ్యర్థులపై దాడులు జరిగాయని, మహిళా అభ్యర్థుల పట్ల కూడా అనుచితంగా వ్యవహరించారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ జోక్యంతో అభ్యర్థులు నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయగలిగారని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నామినేషన్ల పరిశీలనలో పక్షపాతం చూపితే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ అభ్యర్థులు వెనకడుగు వేయలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని కాకాణి ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య, సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# నెల్లూరు అభివృద్ధికి మరో రూ.1,200 కోట్లతో పనులు

### రెండున్నరేళ్లలో రూ.1,000 కోట్ల అభివృద్ధి చేపట్టాం: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

### 30వ డివిజన్‌లో కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం

**నెల్లూరు,(అక్షర దర్శిని):** కూటమి ప్రభుత్వ హయాంలో నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రెండున్నరేళ్లలో సుమారు రూ.1,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, మరో రూ.1,200 కోట్ల విలువైన పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి నగరంలోని 30వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్‌ను, 30వ డివిజన్ జనసేన కార్పొరేటర్ అభ్యర్థి రిషికేశ్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. రూప్‌కుమార్ యాదవ్‌కు రాజకీయ అనుభవం ఉందని, నగర అభివృద్ధికి ఆయన నాయకత్వం ఉపయోగపడుతుందని ఎంపీ పేర్కొన్నారు. యువ నాయకుడైన రిషికేశ్

మిగతా 2 లో......



# కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

### పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకూరుపేట జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి రెడ్డి పాల్గొని, రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించే సమయంలో ఆయనకు తోడుగా ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత ప్రతి కూటమి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. పరస్పర సమన్వయంతో ఎన్నికల ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరి సహకారంతో విజయం సాధిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



03



## అక్షర దర్శిని దినపత్రిక కథనానికి స్పందన

- సంగం రహదారిపై చెత్త తొలగింపు
- పంచాయతీ అధికారుల చర్యలు.. ప్రయాణికులకు ఊరట

మిగతా 4 లో......





## కలువాయికి 116 బ్యాలెట్ బాక్సులు

▶▶ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అధికారుల సన్నాహాలు వేగవంతం

**కలువాయి,(అక్షర దర్శిని) :** రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి 116 బ్యాలెట్ బాక్సులను కలువాయి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయానికి తరలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకునే చర్యల్లో భాగంగా బ్యాలెట్ బాక్సులను మండల కేంద్రానికి తీసుకొచ్చారు. అధికారుల పర్యవేక్షణలో ఈ తరలింపు ప్రక్రియ చేపట్టారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరచడం, అవసరమైన సమయంలో పోలింగ్ కేంద్రాలకు తరలించడం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.మండలంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఎన్నికల సామగ్రి సిద్ధం చేయడం, సిబ్బందికి విధులు కేటాయించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. బ్యాలెట్ బాక్సులు కలువాయి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకోవడంతో ఎన్నికల సన్నాహక కార్యక్రమాలు మరింత వేగం పుంజుకున్నాయి.

## కూలేందుకు సిద్ధంగా కలువాయి బ్రిడ్జి!

▶▶ ప్రమాదకరంగా మారిన మాదనగారిపల్లి--కుల్లూరు పాత రహదారి

▶▶ ప్రమాదం జరిగాకే స్పందిస్తారా? ▶▶ అధికారులకు కనిపించడం లేదా?



**కలువాయి,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా కలువాయి మండలం మాదనగారిపల్లి నుంచి కుల్లూరుకు వెళ్లే పాత రహదారిపై ఉన్న చిన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు.ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే ప్రజలకు బ్రిడ్జి పరిస్థితి సమస్యగా మారింది. ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడిన తర్వాతే స్పందిస్తారా? ప్రాణనష్టం జరిగితేనే పట్టించుకుంటారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పరిస్థితిని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాద తీవ్రతను అంచనా వేయాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైన మరమ్మతులు చేపట్టి, ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగి రాకపోకలకు అంతరాయం కలగకముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ముందే అప్రమత్తమై ప్రాణాలను కాపాడటం ముఖ్యం. సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది.



# కలువాయిలో టీడీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం





▶▶ గ్రామగ్రామాన పర్యటన.. ఓటర్లను కలుస్తూ మద్దతు అభ్యర్థన

**కలువాయి,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో టీడీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జడ్పీటీసీ అభ్యర్థి అరవ లిఖితతో పాటు కలువాయి బిట్-1 ఎంపీటీసీ అభ్యర్థులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి, తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు.ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని చెబుతూ ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.
ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ఎన్నికల్లో తమకు అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని అభ్యర్థులు హామీ ఇస్తున్నారు. స్థానికంగా ప్రజలతో మమేకమవుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.జడ్పీటీసీ అభ్యర్థి అరవ శ్రావణి, కలువాయి బిట్-1 ఎంపీటీసీ అభ్యర్థులు చల్లా రఘు రామిరెడ్డి, చల్లా ఇందిరాతో కలిసి ప్రచార కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో మండలంలోని గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధిస్తామనే ధీమాతో టీడీపీ అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు.



## నెల్లూరు అభివృద్ధికి మరో రూ.1,200 కోట్లతో పనులు

**మొదటి పేజీ తరువాయి**

యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పొంగూరు నారాయణ చొరవతో నెల్లూరు నగరంలో రహదారులు, పార్కులు, ప్రభుత్వ పాఠశాలలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు సమకూరుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎంపీ కోరారు. ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నెల్లూరు నగర అభివృద్ధి మంత్రి నారాయణతోనే సాధ్యం

▶▶ సైకిల్ గుర్తుకు ఓటు వేయండి.. అభివృద్ధికి బాటలు వేయండి

▶▶ 68, 69వ డివిజన్లలో ఎన్నికల ప్రచారంలో డాక్టర్ సింధూర

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగర అభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణతోనే సాధ్యమని ఆయన కుమార్తె డాక్టర్ సింధూర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 68, 69వ డివిజన్ల పరిధిలోని రంగనాయకులపేట, కపాటిపాలెం ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ తెలుగుదేశం పార్టీ గుర్తు సైకిల్‌పై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయా డివిజన్ల అభ్యర్థులకు, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా సింధూర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ మార్గదర్శకత్వంలో మంత్రి నారాయణ నగర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించడం, ఇప్పటివరకు 30 పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలను వివరించారు. స్థానికుల అభ్యర్థన మేరకు స్మశానవాటిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నగరంలో రహదారుల అభివృద్ధి, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం ద్వారా పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని సింధూర అన్నారు. సుజల స్రవంతి ద్వారా తక్కువ ధరకు తాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నవంబర్ 1న జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కలువాయిలో ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల పర్వం





▶▶ 12 స్థానాలకు 66 నామినేషన్లు.. వైసీపీ నుంచి అత్యధికంగా 31 దాఖలు

**కలువాయి,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు మూడు రోజులపాటు నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 66 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మండలంలో ఎన్నికల సందడి నెలకొంది.ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో ఎంపీడీవో శైలజ, తహసీల్దార్ కృష్ణారెడ్డి నామినేషన్లను స్వీకరించారు. పార్టీ వారీగా పరిశీలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 31, తెలుగుదేశం పార్టీ తరఫున 25, భారతీయ జనతా పార్టీ తరఫున 6, జనసేన పార్టీ తరఫున 2 నామినేషన్లు దాఖలయ్యాయి. బహుజన సమాజ్ పార్టీ తరఫున ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా మరొకరు నామినేషన్ వేశారు.
**కుల్లూరులో ఆసక్తికర పోటీ** కుల్లూరు ఎంపీటీసీ స్థానం జనరల్‌కు కేటాయించడంతో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు. జనసేన పార్టీ తరఫున రామారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దెల రోసిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. బహుజన సమాజ్ పార్టీ తరఫున చింత రవీంద్ర నామినేషన్ వేయడం ప్రత్యేకతగా నిలిచింది.నామినేషన్ల స్వీకరణ ముగియడంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు తదుపరి ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారిస్తున్నారు. తమ అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ అనంతరం బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది.
**పటిష్ట పోలీసు భద్రత** నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు, కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలోకి అనుమతి లేని వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసు బలగాలను మోహరించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రశాంతంగా ముగించారు.

# అక్షర దర్శిని దినపత్రిక కథనానికి స్పందన







- సంగం రహదారిపై చెత్త తొలగింపు
- పంచాయతీ అధికారుల చర్యలు.. ప్రయాణికులకు ఊరట

**పొదలకూరు,(అక్షర దర్శిని):** పొదలకూరు--సంగం రహదారి వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారం, కొబ్బరి వ్యర్థాలపై అక్షర దర్శినిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించే చర్యలు చేపట్టారు. దీంతో రహదారి వెంబడి అపరిశుభ్రత కొంతమేర తగ్గి, ప్రయాణికులకు ఊరట లభించింది.రహదారి పక్కన చెత్తను ఇష్టానుసారంగా పడేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రధాన రహదారుల వెంబడి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో అక్షర దర్శిని కథనం ద్వారా అధికారులు స్పందించి చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే రహదారి పరిసరాల్లో మళ్లీ చెత్త పేరుకుపోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధే మా అజెండా: పొంగూరు రమాదేవి





- జడివానలోనూ తగ్గని ప్రచార జోరు
- రోజుకు పలు డివిజన్లలో మంత్రి కుటుంబం పర్యటనలు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ వేడెక్కుతోంది. కూటమి అభ్యర్థులకు మద్దతుగా మంత్రి పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి, కుమార్తెలు సింధూర, షరణి డివిజన్లలో పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. శుక్రవారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 59, 65, 62, 66వ డివిజన్లలో రమాదేవి ప్రచారం సాగించారు.
ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ, వ్యాపారులను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. కార్పొరేటర్ అభ్యర్థులు దర్శి హరికృష్ణ, ధర్మవరం గణేష్, పొట్లూరి రామకృష్ణ, కపిర రేవతితో పాటు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పలుచోట్ల మహిళలు ఆమెకు హారతులతో స్వాగతం పలికారు.



**అభివృద్ధి, సంక్షేమమే ప్రచారాస్త్రాలు** మంత్రి నారాయణ నేతృత్వంలో నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ రమాదేవి ప్రచారం కొనసాగిస్తున్నారు. పేదలకు వైద్య సేవలు అందించేందుకు నారాయణ నేత్రజ్యోతి ద్వారా కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాలు, అవసరమైన శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. నారాయణ ఆన్ వీల్స్, నారాయణ దంత సురక్ష కార్యక్రమాల ద్వారా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. వీధి వ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత సైకిళ్ల అందజేత వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ ప్రజల మద్దతు కోరుతున్నారు. నెల్లూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, విమర్శలకు అభివృద్ధి పనుల ద్వారానే సమాధానం చెబుతామని రమాదేవి పేర్కొంటున్నారు. నగరంలోని 72 డివిజన్లతో పాటు మేయర్ పీఠాన్ని కూడా కైవసం చేసుకుంటామని టీడీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌కు భారీ మెజార్టీ వస్తుందని రమాదేవి ఆశాభావం వ్యక్తం చేశారు. వర్షంలోనూ కొనసాగుతున్న ప్రచారంతో నగరంలో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

# ముగిసిన పరిషత్ నామినేషన్ల పర్వం..

- పొదలకూరు మండలంలో 19 ఎంపీటీసీ స్థానాలకు 95 నామినేషన్లు..
- టీడీపీ 44.. వైసీపీ 48.. బీజేపీ, జనసేన, కాంగ్రెస్‌ల నుంచి ఒక్కొక్కటి..
- నేడు నామినేషన్ల పరిశీలన..
- నామినేషన్ల పరిశీలనకు పటిష్ట పోలీసు బందోబస్తు..



**పొదలకూరు,(అక్షర దర్శిని):** పొదలకూరు మండలంలో పరిషత్ ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారంతో ముగిసింది. మండలంలోని 19 ఎంపీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 95 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ నుంచి 44, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 48, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నుంచి ఒక్కొక్క నామినేషన్ చొప్పున దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్. విజయకుమార్ రెడ్డి వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థుల దృష్టి ఇప్పుడు పరిశీలన, తదుపరి ఎన్నికల ఘట్టాలపై కేంద్రీకృతమైంది.

**నేడు నామినేషన్ల పరిశీలన..** పొదలకూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన సమయానికి కనీసం 15 నిమిషాల ముందుగా హాజరుకావాలని సూచించారు. గుర్తింపు కార్డు, నామినేషన్ రసీదు, రిజర్వుడు స్థానాలకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం, నామినేషన్‌తో పాటు సమర్పించిన ఇతర పత్రాల అసలు ప్రతులను వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు.నామినేషన్లపై అభ్యంతరాలు ఉంటే నిబంధనల ప్రకారం పరిశీలన సమయంలో లిఖితపూర్వకంగా సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. నిబంధనల మేరకు అభ్యర్థితో పాటు ఒక ప్రతిపాదకుడు లేదా అధికారం పొందిన వ్యక్తికి మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. పరిశీలన అనంతరం చెల్లుబాటైన నామినేషన్ల జాబితాను కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించనున్నారు.

**నామినేషన్ల పరిశీలనకు పటిష్ట బందోబస్తు..** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో పోలీసు శాఖ తదుపరి ఘట్టమైన నామినేషన్ల పరిశీలనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. శుక్రవారం సాయంత్రం నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించిన నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ వెంకట్రావు, ఎస్సై శివరాకేష్‌లకు పలు సూచనలు చేశారు. పరిశీలన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, కేంద్రం వద్ద క్రమశిక్షణతో కూడిన బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ల పరిశీలన నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణకు అనుకూలమైన ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



## పొదలకూరు బిట్-3 వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా కోవూరు వెంకటేశ్వర్లు నామినేషన్

- పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలు సమర్పించిన అభ్యర్థి

పొదలకూరు,(అక్షర దర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల సందడి కొనసాగుతోంది. పొదలకూరు బిట్-3 ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోవూరు వెంకటేశ్వర్లు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆయన ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు మద్దతు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండవోలు నుంచి స్వతంత్ర ఎంపీటీసీ అభ్యర్థిగా తైదుపాటి నరసింహులు



రాపూరు,(అక్షరదర్శిని) : నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని గుండవోలు పంచాయతీ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో గుండవోలు ఎంపీటీసీ స్థానానికి తైదుపాటి నరసింహులు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన ఆయన పోటీ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు తమ ప్రచార కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారు. గుండవోలు ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నరసింహులు పోటీ చేయడంతో ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారన్నది ఫలితాల అనంతరం వెల్లడికానుంది.

## సిద్దవరం ఎంపీటీసీ అభ్యర్థిగా సర్వేపల్లి రావమ్మ నామినేషన్




రాపూరు,(అక్షర దర్శిని) : నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని సిద్దవరం ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిగా సర్వేపల్లి రావమ్మ నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించి ఎన్నికల బరిలో నిలిచారు. సిద్దవరం ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ తరఫున రావమ్మ పోటీకి దిగడంతో మండలంలో ఎన్నికల సందడి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. సిద్దవరం సెగ్మెంట్‌లో ఎన్నికల పోటీ ఎలా సాగుతుందన్నది రానున్న రోజుల్లో స్పష్టత రానుంది.

## పొదలకూరు బిట్-4 వైసీపీ అభ్యర్థిగా దాసరి కల్పన నామినేషన్

**పొదలకూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పొదలకూరు బిట్-4 ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దాసరి కల్పన శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆమె ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆమెకు మద్దతు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎన్నికల నేపథ్యంలో పోలీసుల రూట్ మార్చ్





- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యం
- జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల

**నెల్లూరు,(అక్షర దర్శిని):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ముందస్తు భద్రతా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా వేదాయపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని డైకస్ రోడ్డు, చంద్రబాబు కాలనీతో పాటు బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దూరు గ్రామంలో పోలీసులు రూట్ మార్చ్ నిర్వహించారు.ఎన్నికల సమయంలో ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం, శాంతిభద్రతల పరిరక్షణపై భరోసా కల్పించడం, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.ప్రజలు ఎలాంటి భయం, ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల ఐపీఎస్ తెలిపారు.





# 54, 55వ డివిజన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

- మానికల సునీల్ ఆధ్వర్యంలో 50 కుటుంబాల చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి నారాయణ, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 54, 55వ డివిజన్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరు నగర వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మానికల సునీల్ ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మంత్రి పొంగూరు నారాయణ, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పార్టీలోని పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డివిజన్లలో పార్టీని బలోపేతం చేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల వేళ వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల చేరికలతో నగరంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హై అలర్ట్

**నెల్లూరు కలెక్టరేట్ అక్షర దర్శిని** బంగాళాఖాతంలో అల్పపీడ నం ఏర్పడిన నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో అది బల పడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని, తీరం వెంబ డి గంటకు 60--70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచడంతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు, ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి, నదులు, రిజర్వాయర్లలోకి చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన బోట్లు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. బోట్లు, వలలు, ఇతర వేట సామగ్రిని ఎత్తైన, సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకో వాలని తెలిపారు. తుఫాను ప్రభావం దృష్ట్యా మత్స్యకారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆక్వా రైతులు చెరువుల్లో నీటి లవణీయత (సెలీనిటీ), ప్రాణవాయు వు స్థాయులను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, అవసరమైన స్థాయిలో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా చెరువుల గట్లకు గండ్లు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అన్నదాతలకు దీపావళి కానుక

**అక్షర దర్శిని** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎం-కిసాన్ ) తదుపరి విడత కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న కోట్లాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది.పథకం కింద 24వ విడత నిధులను ఈనెల 30న అధికారికంగా విడుదల చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసింది. గతంలో 23వ విడత పంపిణీ జరిగి నాలుగు నెలలు దాటడంతో పాటు.. ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ 25న వారణాసి పర్యటన సందర్భంగానే ఈ నిధులు విడుదలవుతాయని విస్తృతంగా ప్రచారం సాగింది. అయితే, దీపావళి కానుకగా అక్టోబర్ 30నే రూ. 2 వేలు.. లబ్ధిదారుల ఖాతాల్లో డిబిటి ద్వారా జమ కానుండటంతో రైతుల నిరీక్షణకు తెరపడింది.అన్నదాతలకు పెట్టుబడి సహాయం అందించే లక్ష్యంతో ప్రారంభమైన పీఎం-కిసాన్ పథకం ద్వారా ప్రతి ఏటా అర్హులైన రైతు కుటుంబాలకు రూ. 6,000 చొప్పున ఆర్థిక సాయం లభిస్తుంది. ఈ మొత్తాన్ని ఏడాదికి మూడు విడతల్లో, ఒక్కో విడతకు రూ. 2,000 చొప్పున ఎలాంటి దళారీల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ ) పద్ధతిలో జమ చేస్తారు.

**జాబితాలో మీ పేరు సరిచూసుకోండి** రైతులు ముందుగా తమ పేరు 24వ విడత అర్హుల జాబితాలో ఉందో లేదో అధికారిక వెబ్‌సైట్ (పీఎంకిసాన్.జిఓవి.ఇన్) లేదా 'పీఎం-కిసాన్' మొబైల్ యాప్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చు. పోర్టల్‌లోని 'ఖీుతీఎవతీం జశీతీఅవతీ' విభాగంలో ఉన్న 'దీవఅవటఱఎఋుతీఎ ూఱర్'పై క్లిక్ చేసి రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామాన్ని ఎంచుకుని వివరాలను చూడవచ్చు. ఒకవేళ పేమెంట్ స్టేటస్‌లో ఇ-కేవైసీ లేదా ల్యాండ్ సీడింగ్ పెండింగ్ అని ఉంటే, వెంటనే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి సవరించుకోవడం శ్రేయస్కరం.

**ఇ-కేవైసీ, భూమి వివరాల నమోదు తప్పనిసరి** అర్హులైన నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఈ పథక ప్రయోజనం దక్కాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఇప్పటివరకు తమ ఖాతాకు ఇ-కేవీసీ ప్రక్రియను పూర్తి చేయని రైతుల ఖాతాల్లో నిధులు జమ కావు. కాబట్టి రైతులు వెంటనే తమ సమీపంలోని సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లి లేదా పీఎం కిసాన్ పోర్టల్/యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి. దీనితో పాటు భూమి వివరాల ధ్రువీకరణ, ఆధార్-బ్యాంక్ ఖాతా అనుసంధానం పూర్తయిన వారికి మాత్రమే ఈ విడత సొమ్ము త్వరితగతిని జమ అవుతుందని అధికారులు స్పష్టం చేశారు.

# ఆత్మకూరులో రాజకీయాల్లో కీలక మలుపు

- టీడీపీలో చేరిన మేకపాటి కుటుంబీకులు
- వైసీపీకి గుడ్ బై చెప్పిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులు
- మంత్రి ఆనం సమక్షంలో టీడీపీలో చేరిక
- షకీలా విజయానికి కృషి చేస్తామని ప్రకటన
- ఎన్నికల వేళ కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం



**ఆత్మకూరు, అక్షర దర్శిని ప్రతినిధి** ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆత్మకూరు మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ కోడూరు శ్రావణ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ మేకపాటి దీప్తి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం స్వయంగా ఆత్మకూరులోని వారి నివాసానికి వెళ్లి, డాక్టర్ మేకపాటి దీప్తి, డాక్టర్ కోడూరు శ్రావణ్ కుమార్ రెడ్డి దంపతులకు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి ఆనం నాయకత్వంలో ఆత్మకూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు.

**డాక్టర్ బి. షకీలా విజయానికి కృషి చేస్తా..** ఈ సందర్భంగా డాక్టర్ కోడూరు శ్రావణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బి. షకీలా విజయానికి తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, పట్టణ అభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు.

**ఆత్మకూరులో ఎన్డీఏ కూటమికి మరింత బలం..** ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకున్న తరుణంలో మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ కోడూరు శ్రావణ్ కుమార్ రెడ్డి దంపతులు టీడీపీలో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చేరికతో ఆత్మకూరులో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల వేళ ఈ పరిణామం ఎన్డీఏ కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

# జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, సంక్షేమ నిధి సాధనే ఏపీజేఎఫ్ లక్ష్యం






- నెల్లూరులో విజయవంతంగా ఏపీజేఎఫ్ జిల్లా మహాసభ
- జిల్లా అధ్యక్షుడిగా శాఖమూరి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఉడతా శరత్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి నివేశ స్థలాలు సాధించడం, జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయడం ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ (ఏపీజేఎఫ్) ప్రధాన లక్ష్యమని ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు పీర్ల శివరాజేష్ తెలిపారు. శుక్రవారం నెల్లూరు టౌన్‌హాల్ ఆవరణలో జిల్లా అధ్యక్షుడు శాఖమూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో, ఉడతా శరత్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఏపీజేఎఫ్ జిల్లా మహాసభ విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా పీర్ల శివరాజేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఏపీజేఎఫ్ అనతికాలంలోనే పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా కృషి చేస్తామని, ఆరోగ్య భద్రత, కుటుంబ సంక్షేమానికి అవసరమైన చర్యల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. పాత్రికేయ విలువలకు ప్రాధాన్యమిస్తూ, నిబద్ధతతో కూడిన నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఫోరమ్‌ను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.ఫోరమ్ సీనియర్ రాష్ట్ర నాయకుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఏపీజేఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అక్రిడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యంతో పాటు జర్నలిస్టుల హక్కుల సాధనకు సంఘం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సంఘాలకు అతీతంగా జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**ఏకగ్రీవంగా నూతన జిల్లా కమిటీ ఎన్నిక** మహాసభలో ఏపీజేఎఫ్ నెల్లూరు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శాఖమూరి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఉడతా శరత్ యాదవ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఆహ్వానితులుగా వి.ఎస్. రామచంద్రమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సింహపురి బాబు, గౌరవ సలహాదారులుగా జయప్రతాప్ రెడ్డి, నన్నూరు శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా చేవూరు శ్రీనివాసులు, ఎస్. ప్రభావతి, పాశం సాయి రాజా, కార్యనిర్వాహక కార్యదర్శిగా కే. గోపి, కార్యదర్శులుగా కే. కొండయ్య, డాక్టర్ చేవూరు చిన్న, జి. హేమంత్, జేసీ శేషగిరి, అల్విన్, రమేష్, చీరల మస్తానయ్య, సంయుక్త కార్యదర్శిగా రవీంద్రరెడ్డి, కోశాధికారిగా జె. మల్లికార్జున ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బాలారావు, వెంకటేశ్వర్లు, శ్రీరస్తు శ్రీనివాసులు, రమేష్ తదితరులను ఎన్నుకున్నారు.జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం ఐక్యంగా పనిచేయాలని మహాసభలో నాయకులు పిలుపునిచ్చారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.